సాక్షి అనకాపల్లి

గురువారం ▮ 18 ▮ సెప్టెంబర్ ▮ 2025



ఘనంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీన్ళ సింహస్వామికి ఘనంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు సమర్పించారు.



రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజులీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని వందలాది మంది విద్యార్థులు ధర్నా చేశారు. 8లో



ఘనంగా యాత్రి దివస్

విశాఖ విమానాశ్రయంలో గురువారం నిర్వహించిన యాత్రి దివస్ ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, లైంగికదాడి చేసిన యువకుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్టు నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో బుధవారం స్థానిక విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సింగన శ్రీను అదేగ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వంచించి, లైంగికదాడి చేశాడని మంగళవారం ఫిర్యాదు అందినట్టు చెప్పారు. ఎస్.రాయవరం , అడ్డురోడ్డు సర్కిల్ పోలీసులు విచారణ జరిపి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.ఈ సమావేశంలో అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ,ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వుషు పోటీలకు నర్సీపట్నం విద్యార్థినులు



జిల్లాస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థినులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ వుషు పోటీల్లో నర్సీపట్నానికి చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు విజయం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన ఎస్.లావణ్య, ఎస్.నైసీ, ఎం.నిషిత, ఎం.కుసుమవర్ధిని, ఎస్.కీర్తి, రెడ్డి చాందిని, కోడూరు నూకగీత, లొండ ఐశ్వర్య, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని సకిరెడ్డి హరిణి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను, కోచ్ ప్రియాంకను గురుకుల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పీడీ సాయి అభినందించారు.

పెద్దేరు నుంచి 400 క్యూసెక్కుల నీరు విడుదల



మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. దీంతో 400 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. నీటి ప్రవాహం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఇప్పటికే గ్రామాల వీఆర్వోలకు సమాచారం అందించినట్టు చెప్పారు.

కౌలు రైతుకు కష్టం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వారి కష్టాలు చెప్పనలవికానివిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం మంజూరు చేయలేదు. పెట్టుబడి సాయం అందక...అటు రుణాలు మంజూరుకాక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ సాగు చేస్తున్నారు. ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు నష్టపోతున్నా పాలక పెద్దల్లో మాత్రం కనీసం చలనం రావడం లేదని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు.

అమలు కాని అన్నదాత సుఖీభవ ■ కూటమి పాలనలో జిల్లాలో 4,285 మందికి మొండి చేయి



సాక్షి, అనకాపల్లి: కౌలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత వారిని పట్టించుకోవడం లేదు. కనీసం ఎటువంటి సాయం అందించడం లేదు. కూటమి నాయకులు చెబుతున్న మాటలకు , క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. రైతన్న ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఎదురు దెబ్బలే చవిచూశాడు. ఎరువుల కొరత ఒక వైపు వేధిస్తుంటే..మరో వైపు కౌలు రైతులకు కనీసం ఎటువంటి సాయం అందడం లేదు. కుటుంబ పోషణకు పలువురు రైతులు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ప్రకృతి సహకరిస్తే పరవాలేదు. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. కౌలుకు తీసుకున్న భూమిని సాగు చేయాలంటే వారికి పెట్టుబడి కావాలి. ఇందుకోసం వారు ప్రైవేటు వ్యాపారుల దగ్గర వడ్డీకి డబ్బులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం అందించే సాయంతో పాటు రుణ సాయం కూడా అందని దుస్థితి ప్రస్తుతం నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా సాధారణ రైతులు మాదిరిగా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేశారు. దీంతో వారు పంటల సాగుకు పెట్టుబడి కోసం అప్పులు చేసే పరిస్థితి తప్పింది. రైతు భరోసా కింద వారికి రూ. 13,500 చొప్పున ఇవ్వడం వల్ల వారు వాటిని విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు పెట్టుబడిగా ఉపయోగించుకునేవారు. అదేవిధంగా కౌలు రైతులకు రుణాలు కూడా ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

> వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదువేలకు పైగా రైతులకు సాగు హక్కు కార్డులు అందించారు. ఒక్కొక్కరికీ రూ.13,500 చొప్పున
>
> **వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పండగే**
>
> పెట్టుబడి సాయం మంజూరు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కౌలు రైతులకు మొండి చేయి చూపించారు.

4,285 మంది దరఖాస్తు

అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో తొమ్మిది వేల మందికి పైగా రైతులు దరఖాస్తులు చేశారు. వీరిలో 4,285 మంది కౌలు రైతులు ఉన్నట్టు వ్యవసాయ శాఖ గుర్తించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద సాధారణ రైతులకు రూ.ఏడు వేలు పెట్టుబడి సాయం అందించింది. వారితో పాటు తమకూ సాయం అందిస్తారని కౌలురైతులు ఆశగా ఎదురు చూశారు. సెప్టెంబర్ నెలాఖరుకు కూడా పెట్టబడి సాయం అందకపోవడంతో తీవ్ర నిరాశనిస్పృహలకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నివిధాలుగా సాయం అందడంతో సంతోషంగా సాగు చేసిన కౌలు రైతులు కూటమి పాలనలో అన్నింటికీ దూరమై కష్టాల నడుమ సాగు కొనసాగిస్తున్నారు.

> **కౌలు రైతులను గుర్తించాం..**
>
> జిల్లాలో కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తాం. ఇప్పటికే నాలుగు వేల మంది వరకూ కౌలు రైతులు అర్హులుగా గుర్తించాం. గతంలో సీసీఆర్ కార్డు ఉన్నా..వారు ఈ ఖరీఫ్ సీజన్‌లో క్రాప్ వేస్తేనే కౌలుదారులుగా గుర్తిస్తాం. ప్రభుత్వ జీవో 33 ప్రకారం జిల్లాలో అర్హత ఉన్న కౌలు రైతులకు అక్టోబర్ నెలాఖరు నాటికి పెట్టుబడి సాయం అందిస్తాం. రెండు విడతలుగా ఈ సాయం అందజేస్తాం.
>
> – మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

పరిశ్రమల స్థాపనకు భూముల కేటాయింపునకు చర్యలు

పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్



రామన్నపాలెం వద్ద ఏపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న యువరాజ్

మాకవరపాలెం: పరిశ్రమల స్థాపనకు భూములను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూలో 290 ఎకరాల ఏపీఐఐసీ భూములతోపాటు యరకన్నపాలెం వద్ద సర్వే నంబర్ 737లోని పేదల సాగులో ఉన్న భూములను, వాటి మ్యాప్‌లను ఆయన బుధవారం పరిశీలించారు. కలెక్టర్ విజయకృష్ణన్, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రామన్నపాలెం జంక్షన్ నుంచి యలమంచిలి మండలం పెదపల్లిని కలుపుతూ హైవే వరకు రోడ్డు నిర్మించేందుకు నిర్ణయించిన మార్గాన్ని కూడా సందర్శించారు. 290 ఎకరాల్లో 50 ఎకరాల చొప్పున బ్లాక్‌లుగా ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇదే భూమిలో రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఇప్పటికే అల్లూరి జిల్లా కలెక్టర్ భూములు కావాలన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఏపీఐఐసీలో ఆధీనంలో ఉన్న 290 ఎకరాలతోపాటు యరకన్నపాలెం వద్ద సర్వేనంబర్ 737లో ఉన్న మరో 400 ఎకరాల్లో పరిశ్రమలకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

విశ్వకర్మ సేవలు ఆదర్శనీయం



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జేసీ జాహ్నవి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐ బాల సూర్యారావు

తుమ్మపాల: విరాట్ విశ్వకర్మ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారన్నారు. ప్రధానంగా కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప, కంచరి తదితర వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి, ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి స్పెషల్ బ్రాంచ్ సీఐ బాల సూర్యారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మకు విశిష్టస్థానం ఉందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈకార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘ఇరిగేషన్’లో ఇంజనీర్ల కొరత

- ఉత్తరాంధ్రలో నాలుగు ఎస్ఈ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లు
- ఈఈలు, డీఈఈలు కూడా సర్దుబాట్లే
- పదోన్నతుల్లోనూ జిల్లాకు అన్యాయం

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్రలో కీలకమైన జలవనరుల శాఖపై కూటమి సర్కార్ అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తోంది. సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. ఉత్తరాంధ్రలో ఉన్న ఐదు ఎస్ఈ పోస్టుల్లో వంశధార ప్రాజెక్ట్ ఎస్ఈ ఒక్కరే రెగ్యులర్. ఎస్ఈలు రిటైర్ అయినా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎక్కడో పనిచేస్తున్న వారికి అప్పగిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోంది.

ధవళేశ్వరం నుంచి..

విశాఖ ఎస్ఈ పోస్టులో ధవళేశ్వరం ప్రాజెక్ట్ ఎస్ఈని ఇన్‌చార్జ్‌గా నియమించారు. విస్తారంగా వర్షాలతో రిజర్వాయర్లు పొంగి ప్రవహిస్తున్న సమయంలో ఆయన ఇక్కడికి రాలేక, అక్కడే ఉండలేక తిప్పలు పడే పరిస్థితి. కీలకమైన విశాఖలో అనేక రిజర్వాయర్లలో నీరుచేరి గేట్లు ఎత్తడంలో అనుమతులు రాక ఏఈలు, డీఈఈ తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

ఈఈలు, డీఈఈలూ ఇన్‌చార్జిలే!

ఉమ్మడి ఉత్తరాంధ్రలో కీలకమైన నార్త్ కోస్టు సీఈ పోస్టు కూడా ఇన్‌చార్జితోనే నడుస్తోంది. ఉమ్మడి విశాఖలోని నాలుగు డివిజన్లలో మూడింట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఈఈ) కరవయ్యారు. దాదాపు అన్ని ఎస్ఈ, ఈఈ పోస్టులు ఇన్‌చార్జిలతోనే నడుస్తున్నాయి. ఇన్‌చార్జిలు రెండు/మూడు పడవల ప్రయాణం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో దాదాపు అన్ని డివిజన్లలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ), అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)తోనే నెట్టుకొస్తున్నారు. ఈ పోస్టుల్లో కూడా చాలా వరకు ఇన్‌చార్జిలే ఉండటం గమనార్హం.

పదోన్నతులు, పోస్టింగుల్లోనూ అన్యాయం

జలవనరుల శాఖలో ఇటీవల ఇచ్చిన పదోన్నతులు, పోస్టింగుల్లో కూడా ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందని సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్రలోని అన్ని ఎస్ఈలు, ఈఈ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. విశాఖ ఎస్ఈ పోస్టుకు ఇన్‌చార్జిగా ధవళేశ్వరం నుంచి వేశారంటే.. ఇక్కడి సిబ్బందిపై ప్రభుత్వానికి ఎంత చిన్నచూపు ఉందో.. తేటతెల్లమవుతోంది.

> **యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం**
>
> సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న 8లో

ప్రాణాలకు తెగించైనా బల్క్ డ్రగ్‌ను అడ్డుకుంటాం

- మండుటెండలో నాల్గోరోజు కొనసాగిన నిరాహార దీక్ష
- సహనాన్ని పరీక్షించవద్దని మత్స్యకారుల హెచ్చరిక
- మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు



మండుటెండలో గొడుగు నీడలో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: ‘మా సహనాన్ని పరీక్షించొద్దు... శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో అణగతొక్కాలని ప్రయత్నిస్తోంది... ప్రాణాలకు తెగించైనా బల్క్‌డ్రగ్‌ను అడ్డుకుంటాం.. ఓట్లేసి గెలిపిస్తే హోంమంత్రి అనిత తమపట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారను కోలేదు’ అంటూ రాజయ్యపేట మత్స్యకారులు ఆగ్రహంతో రగిలిపోయారు. బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహారదీక్ష నాల్గో రోజు బుధవారం కొనసాగింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో టెంట్లు వేసి, దీక్ష కొనసాగించేందుకు సిద్ధపడగా సీఐ కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీక్షకు పర్మిషన్ లేదని, టెంట్లు వేయడానికి వీల్లేదన్నారు. దీంతో గంగపుత్రులు గొడుగుల నీడలో దీక్షను కొనసాగించారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికే పదుల సంఖ్యలో మత్స్యకారులపై కేసులు నమోదు చేశారని, అరెస్టులవడానికి, జైలుకెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామంటూ మత్స్యకార మహిళలు నినాదాలు చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు కె.లోకనాథం, జాతీయమత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, రైతు సంఘనాయకుడు సత్యనారాయణ తదితరులు మద్దతు తెలిపారు. ఎండలో మత్స్యకారులతో కలసి నిరాహారదీక్షలో పాల్గొన్నారు.



పవన్‌కల్యాణ్ రావాలంటూ ప్లకార్డు ప్రదర్శన

దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు

ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ మత్స్యకారులను కూటమిప్రభుత్వం దేశద్రోహులగా చిత్రీకరిస్తోందని, శాంతియుతంగా నిరాహారదీక్ష చేస్తున్న వారిపై ఆంక్షలు విధిస్తోందని చెప్పారు. నాలుగు రోజులుగా రాజయ్యపేటలో పోలీసుల రాజ్యం నడుస్తోందన్నారు.తనను ఆదరించిన మత్స్యకారులను ఆదుకోకపోగా పోలీసుల సాయంతో ఉద్యమంపై హోంమంత్రి అనిత ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నుంచి అసెంబ్లీసమావేశాలు ప్రారంభ కానున్నాయని, ఈ సమావేశాల్లో రాజయ్యపేటలో జరుగుతున్న ఆందోళనల గురించి ప్రస్తావించి బల్క్‌డ్రగ్‌పార్క్ రద్దు చేసే విధంగా బిల్లు పాస్‌చేయాలని కోరారు. దేశంలో మూడు చోట్ల..గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ బల్క్‌డ్రగ్‌పార్క్‌లను పెడుతున్నామని చెబుతున్నప్పటికీ అది నిజం కాదని, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పెడుతున్నారన్నారు. ఈ పార్క్ ఏర్పాటయితే పదుల సంఖ్యలో ప్రమాదకర రసాయన పరిశ్రమలు వస్తాయని, ఈ ప్రాంత మంతా శ్మశానంగా మారుతుందని చెప్పారు. పరిసర ప్రాంతాల వారు పలు వ్యాధులకు గురికావలసి వస్తుందని తెలిపారు. గంగపుత్రులు చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. జాతీయమత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు మాట్లాడుతూ ఇది ఒక్క రాజయ్యపేట మత్స్యకారుల సమస్య కాదని, తూర్పు తీరంలో ఉన్న అందరి సమస్య అని చెప్పారు. శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తే పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించి అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎండలో మహిళలు ఇబ్బంది పడుతుంటే టెంట్లు వేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. మత్స్యకారులు తలచుకుంటే టెంట్లు వేయడం పెద్ద పని కాదని చెప్పారు. తమ సహనాన్ని పరీక్షించవద్దన్నారు. రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులందరిని ఏకం చేస్తామని, త్వరలోనే ఇతరప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులందరినీ రాజయ్యపేట తీసుకు వచ్చి తమ సత్తా ఏంటో చూపిస్తామని తెలిపారు. జాతీయమత్స్యకార సంఘ అధ్యక్షుడు, ఇతర మత్స్యకార పెద్దలను కలసి ఇక్కడి సమస్య వివరిస్తామన్నారు. ప్రాణాలకు తెగించైనా సరే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. రాజయ్యపేట మత్స్యకారులను హోంమంత్రి అనిత మోసం చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఉపాధ్యక్షుడు నాగేశు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ మాట్లాడుతూ మత్స్యకారుల పట్ల పోలీసుల వైఖరి సరికాదన్నారు. ఉద్యమానికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు సోమేష్, పిక్కి తాతీలు, పిక్కి కోదండరావు, మైలపల్లిసూరిబాబు, నారాయణరావు,కాశీరావు,మహేష్, రాజశేఖర్, యజ్జల అప్పలరాజు, కోడకాశీరావు, పైడితల్లి,నూకరాజు,వందలాదిమందిమహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నర్సింహమూర్తి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

అధ్యయన యాత్రలో అడ్డగోలుతనం

- అధికారిక కార్యక్రమాల్లో బంధువులు
- మేయర్ వత్తాసు, కళ్లు మూసుకున్న అధికారులు



సర్కిళ్లలో.. ఓ కార్పొరేటర్ సోదరుడు ముక్కా కిశోర్, మరొకరు గంటా నూకరాజు



రౌండప్‌లో.. ఓ కార్పొరేటర్ భర్త(బ్లూ షర్ట్) గంటా నూకరాజు, వైట్ షర్ట్.. ఓ కార్పొరేటర్ దగ్గరి బంధువు పెంటపల్లి సత్యనారాయణ

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ అధ్యయన యాత్రలు విహార యాత్రలుగా మారాయనే ఆరోపణలు సర్వసాధారణం. అందుకే వామపక్ష కార్పొరేటర్లు వీటిని చాలా వరకు వ్యతిరేకిస్తున్నారు. అయితే అడ్డగోలుగా జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఈ అధ్యయన యాత్రలను మరింతగా దిగజార్చాయన్న ఆరోపణలు మూటుగట్టుకుంటోంది. కార్పొరేటర్లు, అధికారుల కుటుంబ సభ్యులు ఇన్నాళ్లూ షికార్ల వరకే పరిమితమయ్యేవారు. ఈసారి ఓ అడుగు ముందుకేసి అక్కడి అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం గమనార్హం. దీన్ని నియంత్రించాల్సిన మేయర్, జీవీఎంసీ అధికారులు ఇందుకు వత్తాసుగా నిలవడమే విశేషం..!

అధ్యయనం పేరిట విహారం : అధ్యయన యాత్రం కోసం మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కార్పొరేటర్ల బృందం, వారి కుటుంబ సభ్యులు, జీవీఎంసీ అధికారులు మంగళవారం బయలుదేరిన విషయం తెలిసిందే. వీరంతా షెడ్యూల్ మేరకు బుధవారం జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించారు. వాస్తవానికి అధ్యయన యాత్ర మేయర్, కార్పొరేటర్లు, అధికారులకు మాత్రమే. వారి కుటుంబ సభ్యుల షికారుకు, వారు తీసుకున్న రూమ్ చార్జీల భారమూ జీవీఎంసీయే భరించడం రివాజుగా మారింది. ఈసారి మేయర్, కార్పొరేటర్ల బృందంతో వారి కుటుంబ సభ్యులు కూడా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వివాదాస్పదంగా మారింది.

వీరి అవసరమేంటో..? : భీమిలి నియోజకవర్గానికి చెందిన ఓ కార్పొరేటర్ భర్త, ఉత్తర నియోజకవర్గానికి చెందిన మరో కార్పొరేటర్ సోదరుడు, దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఇంకో కార్పొరేటర్ దగ్గరి బంధువు.. ఇలా చాలా మంది నేరుగా జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించి, జైపూర్ నగర్ నిగమ్ మేయర్ సోనమ్ గుర్జార్‌ను కలుసుకున్నారు. అక్కడి కార్పొరేషన్‌లో నిర్వహించిన సమావేశంలో కూడా వీరంతా పాల్గొనడం గమనార్హం. అసలు ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు పాల్గొనవచ్చా? నేరుగా అక్కడి కార్పొరేషన్లోనే కార్పొరేటర్లతో కూర్చుంటే మేయర్ పీలా శ్రీనివాసరావు, అధికారులు ఏం చేస్తున్నట్టో..! అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ సొమ్ముతో షికార్లు చేయడమే కాకుండా.. ఇలా జీవీఎంసీ పరువు తీసేలా వ్యవహరించడం సరికాదని నగరవాసులు ఆక్షేపిస్తున్నారు.

జైపూర్ కార్పొరేషన్‌లో జీవీఎంసీ బృందం

జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించినట్లు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ల బృందం జైపూర్(రెడ్ సిటీని) సందర్శించి జైపూర్ అభివృద్ధి కార్యక్రమాలు, వారసత్వ సంరక్షణ, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజాహిత పాలన వంటి అంశాలపై అధ్యయనం చేశారని, అలాగే స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రణాళికలు, పురాతన వారసత్వ భవనాల సంరక్షణ, సుస్థిర పట్టణాభివృద్ధి వంటివి అమలవుతున్న నూతన పద్ధతులను మేయర్, కార్పొరేటర్ల బృందం పరిశీలించారని జీవీఎంసీ కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా జైపూర్ నగర నిగమ్ మేయర్ సోనమ్ గుర్జార్, ఇంజినీర్ ఓమన్ కార్గ్ జీవీఎంసీ మేయర్, కార్పొరేటర్ల బృందానికి స్వాగతం పలికి, జైపూర్ నగరాభివృద్ధితో పాటు సాధించిన ప్రగతి వివరించినట్లు చెప్పారు. జీవీఎంసీ సాధిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు అన్ని నగరాలకు ఆదర్శంగా ఉంటున్నాయని, విశాఖ నగరం సుందరీకరణతో అందర్నీ ఆకర్షిస్తోందని కొనియాడుతూ జ్ఞాపికను జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు జైపూర్ నగర్ నిగమ్ మేయర్ అందించారు. అనంతరం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు జైపూర్ మేయర్, అక్కడి అధికారులకు విశాఖ నగరాభివృద్ధికి చేపడుతున్న ప్రాజెక్టులు, పారిశుధ్య నిర్వహణ, రెవెన్యూ, ప్రజాపాలన తదితర అంశాలను వివరించి జీవీఎంసీ తరపున జ్ఞాపిక అందించినట్లు సెక్రటరీ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

చోడవరం: స్థానిక శ్రీసీతారామా షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఉషశ్రీ ఎలక్ట్రానిక్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటల వ్యాపించి షాపులో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ కాలిపోయాయి. బుధవారం తెల్లవారుజామున ప్రమాదాన్ని గురించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. రూ. ఐదు లక్షలు వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రమాద కారణంగా తమ జీవనోపాధి కోల్పోయామని షాపు యజమానులు భోరున విలపించారు.

వడ్డాదిలో పలువురికి వైద్య సేవలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో ఇంటింటికీ తిరిగి పలువురు జ్వర బాధితులకు స్థానిక వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. వడ్డాదిలో విష జ్వరాలు అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. రెల్లి కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు పలువురి ఇళ్లకు వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యాధికారి మాధవి,ఏఎన్‌ఎంలు సత్య, సాయిలక్ష్మిలు రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పంచాయతీ సిబ్బందితో రెల్లి కాలనీలో పారిశుద్ధ్య పనులు చేయించారు. పలువురు జ్వరం,దగ్గు,జలుబుతో బాధపడుతున్నట్టు వైద్య సిబ్బంది గుర్తించారు. ఎవరైనా అనారోగ్యంతో బాధ పడితే స్థానిక ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని వైద్యాధికారి సూచించారు.

బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన వాహనాలు



బురదలో కూరుకుపోయి వెళ్తున్న వాహనాలు

బుచ్చెయ్యపేట భీమునిపట్నం, నర్సీపట్నం(బిఎన్) రోడ్డులో రోజు రోజుకు ప్రయాణికులు కష్టాలు ఎక్కువవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే రోడ్డు బాగుపడుతుందని ఆశపడ్డ ప్రజలకి ఆడియాశలే మిగిలేయి. బుధవారం బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల మధ్యన పెద్ద గోతిలో నల్లరాయిని తీసుకెళ్తున్న లారీ బురదలో కూరుకుపోయింది. మూడు పొక్లెయిన్‌ల సాయంతో బయటకు లాగినా లారీ బయటకు రాలేదు. తెల్లవారుజామున దిగిపోయిన లారీ మధ్యాహ్నం 11 గంటలు వరకు బురదలోనే ఉండిపోయింది. దీంతో నర్సీపట్నం, వడ్డాది రహదారిలో తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు కిలోమీటర్లు మేర నిలిచిపోయాయి. ఉద్యోగులు, విద్యార్థులతో పాటు అత్యవసర పనులపై వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు.

ప్రజాస్వామ్యం ఖూనీ



కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. వాటిపై కనీస ధ్యాస లేదు. ప్రజా సమస్యల్ని, ప్రభుత్వంలో జరిగే అవినీతి, అక్రమాలను వెలికితీసి ప్రజా పక్షాన పోరాడే పత్రికలపై, జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు. పత్రికలపై, జర్నలిస్టులపై అక్రమ కేసులతో పత్రికాస్వేచ్ఛను హరిస్తామంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చూపించే సాక్షి పత్రికపై అక్రమ కేసులు నమోదుచేస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధి మీడియా సమావేశం పెడితే అది వార్తగా ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం ఈ ప్రభుత్వానికి మంచిది కాదు.

– మళ్ల విజయప్రసాద్, మాజీ ఎమ్మెల్యే



అమల్లో.. రెడ్ బుక్ రాజ్యాంగం



ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అనుసరించడం లేదు. ప్రజా సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్న ఈ ప్రభుత్వ వైఫల్యాలను వెలికితీసే సాక్షి పత్రిక, టీవీ జర్నలిస్టులపై, సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసే కుట్రలకు పాల్పడుతోంది. ఒక రాజకీయ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే కేసు ఎలా నమోదు చేస్తారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా వెల్లడించిన అంశాలను వార్తగా మలిచే హక్కు జర్నలిస్టులకు ఉంటుంది. అంతమాత్రాన జర్నలిస్టులకు, ఆ పత్రికలకు వాటిని ఆపాదించి కేసులు వేయడం సరికాదు.

– మొల్లి అప్పారావు, విశాఖ తూర్పు సమన్వయకర్త

సాగుకు, వైద్యానికి కూటమి దెబ్బ

- గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో రెండు ప్రాజెక్టులకు రూ. 1000 కోట్లు
- కూటమి ప్రభుత్వం రాకతో ఒకటి రద్దు రెండోది ప్రైవేటు పరం
- నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో నిరసన



నక్కపల్లికి నీరు తరలించేందుకు సిద్ధం చేసిన పైపులు

నాతవరం: స్పీకరు అయ్యన్నపాత్రుడు ఇలాకాలో నాడు సాగురైతులకు, నేడు విద్య వైద్య రంగానికి జీర్ణించుకోలేని నష్టం కూటమి ప్రభుత్వం చేస్తోంది. నియోజకవర్గంలో ఏలేరు తాండవ అనుసంధానానికి మెడికల్ కాలేజీకి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుమారుగా రూ.1000 కోట్లు మంజూరు చేశారు. ఈరెండింటికీ తాలుకా పనులు వివిధ దశలో జరుగుతున్న నేపథ్యంలో వాటిని పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు మాదిరిగా వ్యవహరించింది. రైతుల శ్రేయస్సు పక్కన పెట్టి ఏలేరు కాలువ నీటిని పైపులైను ద్వారా ప్రైవేటు కంపెనీలకు తరలించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నాడు ఏలేరు నీటిని రైతులు సాగు కోసం తాండవ ప్రాజెక్టులోకి తరలించేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ 470.05 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఏలేరు తాండవ ప్రాజెక్టు అనుసంధానం పనులు కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అదే ఏలేరు కాలువలో నీటిని నాతవరం మండలం ఎంబీపట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం వద్ద ఏలేరు నుంచి పైపులైను ద్వారా నక్కపల్లి మండలానికి తరలించేందుకు పనులు చేస్తున్నారు. నక్కపల్లి మండలంలో నిర్మించనున్న ప్రైవేటు కంపెనీలైన స్టీల్‌ప్లాంటు, బల్క్‌డ్రగ్ పార్కుకు అవసరమైన నీటిని ఇక్కడ్నుంచి తరలించనున్నారు. నీటిని తరలించేందుకు ఎ,శరభవరం వద్ద పంప్‌హౌస్ నిర్మాణానికి భూమిని సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. మిట్టల్ కంపెనీ పేరిట రెండు ఎకరాలకుపైగా జిరాయితీ భూమి బలవంతంగా రైతుల నుంచి రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఏలేరు రిజర్వాయరు తాండవ ప్రాజెక్టు అనుసంధానం పనులు పూర్తి అయితే రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతుందని రైతులు ఆశించారు. వారి ఆశలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కింది. అనుసంధానం పనులకు నిధులు మంజూరు చేసినప్పుడు 2022లో నర్సీపట్నం, పాయకరావుపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, గొల్ల బాబురావు, పర్వతనేని పూర్ణచంద్రప్రసాద్ తాండవ ప్రాజెక్టుపై రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఏలేరు తాండవ అనుసంధానం పనులు గత ఏడాది రద్దు చేశారు. ఈఏడాది మాకవరపాలెం మండలంలో మెడికల్ కాలేజీ రూ 500 కోట్లతో పనులు జరుగుతుండగా ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు చూస్తోంది. కళ్ల ముందే అన్యాయం జరుగుతుందని తెలిసి కూడా కూటమి నేతలు నిస్సిగ్గుగా వెనకేసుకు వస్తున్నారు. రైతులకు విద్యార్థులకు శాశ్వతంగా ఉపయోగ పడే కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభిస్తే నేడు ప్రభుత్వం స్వలాభం కోసం ప్రైవేటు పరం చేయాలని చూడడాన్ని ఈ ప్రాంతీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ ధోరణికి నిరసనగా ఈనెల 18వ తేదీన నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం తలపెట్టారు.

ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నాం..



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నియోజకవర్గంలో తలపెట్టిన శాశ్వత పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేయడాన్ని ప్రజలు దృష్టికి తీసుకెళ్తాం. వైజాగ్‌లో ఉన్న కింగ్‌జార్జి ఆసుపత్రిని తలపించేలా మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని నిర్మించాలని నిర్ణయించాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి అనకాపల్లిలో ఏర్పాటు చేసే కాలేజీని నర్సీపట్నం నియోజకవర్గానికి తీసుకు రావడానికి ఎంతో కృషి చేశారు. దీనిని పూర్తి చేయాల్సిన కూటమి పెద్దలు ప్రైవేటుపరం చేయాలని చూడడం బాధాకరం. కూటమి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో తెలియజేస్తాం. నేడు నర్సీపట్నంలో గాంధీ విగ్రహం ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతాం.

– పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే, నర్సీపట్నం

పలు గంజాయి కేసుల్లో నిందితుడు పట్టివేత

రావికమతం: పలు గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితుడుని హైదరాబాద్‌లో పట్టుకొని కొత్తకోట పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి బుధవారం కోర్టులో హాజరుపరిచినట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు చెప్పారు. నిందితుడిపై పలు గంజాయి అక్రమ రవాణా, కొనుగోళ్లకు సంబంధించి, అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం జిల్లాలో పలు పోలీసుస్టేషన్లలో ఏడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన కొరపాకల కుమార స్వామి (33)(ఆలియాస్ కుమార్, చరణ్)విశాఖలోని సింహాచలంలో నివాసం ఉంటున్నాడు. గంజాయి అక్రమ రవాణా, కొనుగోళ్ల వంటి నేరాలకు పాల్పడుతూ 2017 సంవత్సరం నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అతడిపై 2016 నుంచి 2017 వరకూ కొత్తకోట, రోలుగుంట, రావికమతం పోలీసుస్టేషన్లలో ఐదు, విశాఖజిల్లా పెందుర్తి, కాకినాడ పోలీస్ స్టేషన్లలో ఒక్కోటి చొప్పున మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి అతడి కోసం గాలించారు. నిందితుడు హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటూ అక్కడి పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నట్టు సమాచారం తెలియడంతో స్థానిక పోలీసుల సహకారంతో అతడిని పట్టుకొని కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఘనంగా 63 అడుగుల వినాయకుడి నిమజ్జనం

చోడవరం: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా చోడవరం నెలకొల్పిన 63 అడుగుల ఎత్తయిన నిలువెత్తు వినాయకుడి విగ్రహాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిమజ్జనం చేశారు. స్వామివారికి పెట్టిన 234 కేజీల భారీ లడ్డూని అంకుపాలెం గ్రామానికి చెందిన నాగులాపల్లి అరవింద్ అనే భక్తుడు రూ.లక్షా 53వేలకు వేలంలో పాడి ఆ లడ్డూని భక్తులందరికీ పంపిణీ చేశారు. బుధవారం ఉదయం నుంచి స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించి, 234 కేజీల లడ్డూను వేలం వేసిన అనంతరం మధ్యాహ్నం 3గంటలకు ఫైర్ ఇంజిన్ల సాయంతో నీటితో పంపింగ్ చేసి స్వామివారి అనుపు ఉత్సవం నిర్వహించారు.

పేదలకు వైద్యం దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్య సేవపేరుతో నడుపుతున్న ఆరోగ్యశ్రీ సేవలను కూటమి ప్రభుత్వం నిలిపివేసి యూనివర్సల్ హెల్త్ స్కీం పేరిట వైద్య సేవలు కొనసాగించాలనే ప్రతిపాదన అత్యంత దయనీయంగా మారిందని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల రోగులకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తే, సీఎం చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను శంకుస్థాపన చేసి, ఆరు మెడికల్ కళాశాలలను ప్రారంభించడం జరిగిందని, చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం అన్యాయమని, పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించకూడదనే ఆలోచనతో ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఆరోగ్య శ్రీలో 1700లకు పైగా వ్యాధులకు సేవలు అందిస్తే, వైఎస్సార్‌సీపీ పానలో 2900కు పైగా వైద్యసేవలకు ఉచితంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ స్కీమ్ అని రాష్ట్రంలోని 1.83 కోట్ల కుటుంబాలకు ఈ బీమా వర్తిస్తుందని, లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అడిగినటువంటి కో – పేమెంటు విధానం గురించి ఈ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. వ్యవస్థలోని మేలు చేయాలనుకునే సంస్థలను అణగదొక్కాలనే విధంగా, మెడికల్ కళాశాలలను ప్రైవేటువర్గాలకు పట్టం కట్టాలనే విధంగా, చేస్తున్న ఈ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

గోసంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారతి స్వామి

పాయకరావుపేట: దేశవ్యాప్తంగా జిల్లాల వారీగా గోసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపకులు, అఖిలాంధ్ర సాధు పరిషత్ కార్యదర్శి కృష్ణ చరణానంద భారతి స్వామి అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన హిందూ సనాతన ధర్మ మహాసభలో ప్రసంగించారు. ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా సంస్కృత విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని, గోవధను నిషేధించాలని, హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, ఆక్రమణలకు గురైన ఆలయ భూములను దేవాలయాలకు అప్పగించాలన్నారు. సభ ప్రారంభానికి ముందు పాండురంగ దేవస్థానం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాదయాత్ర చేశారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇస్తామన్న గ్రాంట్‌కు కక్కుర్తిపడి.. అన్నదాతలను రాష్ట్ర ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు మోదీ సర్కార్ పీఎం ప్రణామ్‌కు రూపకల్పన చేసిందని చెప్పారు. ఎరువుల వినియోగం తగ్గించి తద్వారా ఆదా అయ్యే సబ్సిడీలో సగం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయిస్తామని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్‌కు ఆశపడి రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల దిగుమతిని తగ్గించి, అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకుని ఎరువులు సరఫరా చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

జిల్లాలో 332 మలేరియా, 99 డెంగ్యూ కేసులు నమోదు

జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర



డీఎంవో వరహాలదొర

దేవరాపల్లి: జిల్లాలో ఈ ఏడాది 332 మలేరియా, 99 డెంగ్యూ కేసులు నమోదైనట్టు జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం జరిగిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాకు చెందిన పలు గ్రామాలు అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆనుకుని ఉండడంతో మలేరియా కేసులు పెరిగాయన్నారు. మలేరియా కేసులు నమోదైన 108 గ్రామాల్లో, 135 హాస్టళ్లలో దోమల నివారణ మందును పిచికారీ చేయించినట్టు చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమ కాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు విధిగా వినియోగించాలన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గ్రౌండ్ పరిశీలన



కృష్ణదేవిపేట హైస్కూల్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు, కమిటీ సభ్యులు

గొలుగొండ: వచ్చేనెల 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌ను బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 26 జట్లు ఈ పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాతవరం, గొలుగొండ ఎస్‌ఐలు తారకేశ్వరరావు, రామారావుతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ రాజు, హెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

నర్సీపట్నం: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ వందలాది మంది విద్యార్థులు బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అబిద్‌సెంటర్‌కు వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. మున్సిపల్ స్టేడియంలో గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు.

జిల్లాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ప్రధానమంత్రితో సన్నిహితంగా ఉంటానని చెబుతున్న ఎంపీ సీఎం రమేష్ జిల్లాలో మెడికల్ కళాశాలను నిర్మించకుండా ప్రైవేట్‌పరం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. కూటమి నాయకులు ఆఖరికి వైద్యం కూడా పేదలకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు దేవి, దేవ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు మెటలర్జీలో నైపుణ్య శిక్షణ

అనకాపల్లి: నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ), రష్యా పరిశ్రమలు, వ్యాపారుల యూనియన్(ఆర్ఎస్‌పీపీ)తో కలిసి పర్వోరాలేస్ మెటాలర్జికల్ కాలేజీ(రష్యా)లో 3 సంవత్సరాలు 6 నెలల పూర్తిస్థాయి డిప్లొమా ప్రోగ్రామ్ కోసం అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా నిరుద్యోగ విద్యార్థులు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ పని అనుభవం పొంది, ఉన్నతమైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చున్నారు. ఐటీఐ (ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, ఆటోమోటివ్) లేదా ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పూర్తి చేసి ఉండాలని, 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంగ్లీష్‌లో కనీసం 75శాతం మార్కులు సాధించి, ఆ భాషలో మంచి ప్రావీణ్యం ఉండాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు https://naipunyam.ap.gov.inలో నమోదు చేసుకోవాలని, సెల్ నంబర్లు 9988853335, 8712655686ను సంప్రదించాలన్నారు.

ఎయిర్‌పోర్టులో ఘనంగా యాత్రి దివస్

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కంటి వైద్యం, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో గురువారం నిర్వహించిన యాత్రి దివస్ ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. టెర్మినల్ భవనంలో నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ, ఫోక్ డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. ఎయిర్ పోర్టు ప్రాంగణంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పీవీఎన్ మాధవ్, గండి బాబ్జి, కె.ప్రభాకర్, కూన రవికుమార్ తదితరులు మొక్కలు నాటారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిపిన చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ఎయిర్‌పోర్టు ఆవరణలో వాసన్ ఐ కేర్ సహకారంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. వైజాగ్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఉద్యోగులు, ప్రయాణికులు, సిబ్బంది పాల్గొన్నారు. విమానాశ్రయ పరిశుభ్రత, సేవా ప్రమాణాలపై ప్రయాణికులతో మాట్లాడి, అభిప్రాయాలు తీసుకున్నారు. విమానాశ్రయాల్లో వివిధ రకాల ఉద్యోగావకాశాలు, అభ్యసించాల్సిన కోర్సులపై పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ యాత్రి సేవా దివాస్ కార్యక్రమం ప్రయాణికులకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. విజయవంతం చేసిన ఉద్యోగులను, సిబ్బందిని అభినందించారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలి

రేపు మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద నిరసన



మాట్లాడుతున్న అనకాపల్లి, పెందుర్తి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, అదీప్‌రాజు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు రావాలని, పేద రోగులకు సకాలంలో వైద్యసేవలు అందాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేసి భవనాలు నిర్మిస్తే, 2023 ఏడాదిలో ఆరు మెడికల్ కళాశాలల్లో మెడికల్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటే, కూటమి పాలనలో మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 19న నర్సీపట్నం నియోజకవర్గ మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలలను టీడీపీ కార్పొరేట్ నాయకులకు ధారాదత్తం చేయడానికి సీఎం చంద్రబాబు చర్యలు చేపడుతున్నారన్నారు. పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నపరెడ్డి అదీప్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యం రెండు నేత్రాలుగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తే, సీఎం చంద్రబాబు పాలనలో విద్య, వైద్య రంగాలను ప్రైవేట్ పరం చేస్తున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఫీజ్ రియింబర్స్‌మెంట్ చేసి పెద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని చేస్తే, నేటి పాలనలో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మెడికల్ కళాశాలలను దేశంలో ఎక్కడా ప్రైవేట్ పరం చేయలేదని, మన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అన్యాయమన్నారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ మాట్లాడుతూ కూటమి 15 నెలల పాలనలో రాష్ట్ర ప్రజలు విరక్తి చెందారని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో అప్పగిస్తే రాష్ట్రంలో విద్యార్థుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు బాదపు హరికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పట్టణ–2, 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఆపరేషన్(ఈఈ) రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చడం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. నర్సింగరావుపేట, నారాయణ కాలేజీ రహదారి, మెహర్‌బాబా వీధిలో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా అధ్యక్షుడు బోయిన చిన్నారావు, ప్రధాన కార్యదర్శి చల్లా నాగేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ అరియర్స్, ఎన్‌క్యాష్‌మెంట్ నేటికి పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. మెరుగైన కొత్త పీఆర్సీతో పాటు పాత బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ 15 నెలలు అవుతున్నా అమలుకు నోచుకోలేదన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అనకాపల్లి టౌన్: యువత రక్తదాన శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఎంపీ సీఎం రమేష్ క్యాంప్ కార్యాలయంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అధిక సంఖ్యలో యువకులు, పార్టీ నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దారపురెడ్డి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో సిద్ధి వినాయక దేవస్థానంలో మోదీ జన్మదినం సందర్భంగా పూజలు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో పలక రవి, బొడ్డేడ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవి

అనకాపల్లి: అనకాపల్లి జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గాంధీనగరం సరస్వతి విద్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా వేగి వీరునాయుడు, వసంత, కార్యదర్శిగా ఎస్.అన్నారావు, కోశాధికారిగా ఆర్.దేవుడు, సహాయ కార్యదర్శిగా సుమన్, అడిషనల్ కార్యదర్శిగా చిరంజీవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రామరాజు, రామకృష్ణ, రాజశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 73 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,550	4,910
రెండో రకం	3,710	3,710
మూడోరకం	---	నిల్

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1, బీ పాజిటివ్–7, ఓ పాజిటివ్–18, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 13706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలపై శీతకన్ను..!

- చినుకు పడితే చిత్తడిమయం
- అధ్వానంగా రోడ్లు, కాలువలు
- అలంకారప్రాయంగా ఇంటింటి కుళాయిలు
- కూటమి ప్రభుత్వ తీరుతో లబ్ధిదారులకు తప్పని అవస్థలు



అధ్వానంగా కాలనీ రోడ్డు

కశింకోట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీలపై ప్రస్తుత కూటమి సర్కారు శీతకన్ను వేసింది. కనీస మౌలిక వసతులు కల్పించకుండా వేధిస్తోంది. కశింకోట పంచాయతీ పరిధిలో ఉన్న జగనన్న కాలనీలు వర్షం పడితే జలమయమవుతున్నాయి. మట్టి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీటి సరఫరా లేక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దూర ప్రాంతం నుంచి మంచినీటి తెచ్చుకోవలసిన దుస్థితిని మహిళలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గత్యంతరం లేక అక్కడే జీవనం సాగిస్తూ నరకయాతన అనుభవించాల్సి వస్తుందని వాపోతున్నారు. మండల కేంద్రమైన కసింకోట మేజర్ పంచాయతీ పరిధిలో



తుప్పల మధ్య సత్తెమ్మ కాలనీలోని వైఎస్సార్ కాలనీ

సుమారుగా 20 వేల జనాభా ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం రైతుల నుంచి భూములు సేకరించి ఐదు వైఎస్సార్–జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. వాటిలో సుమారు 600 మందికి గృహాలు మంజూరు చేశారు. వాటిలో ఎక్కువ శాతం మంది లబ్ధిదారులు నిర్మించుకుని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఆయా కాలనీలను పట్టించుకోలేదు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఏడాది క్రితం ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. వాటికి నీరు సరఫరా మాత్రం చేయడం లేదు. దీని కోసం నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో దూరంగా



చుక్కనీరు ఇవ్వని ఇంటింటి కుళాయి

ఉన్నా వడ్డీ వీధి ప్రాంతానికి వెళ్లి కుళాయి నీరు పట్టుకోవాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు .ఈ విషయం అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో సదుపాయాలు మెరుగుపరిచి, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



వైఎస్సార్ మెగా లేఅవుట్ కాలనీలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు



కశింకోటలోని వడ్డీ వీధిలో వైఎస్సార్ మెగా లేఅవుట్‌లో నిలిచిన వర్షపు నీరు

కాలనీలో నీరు పోయే దారేది?



వర్షం పడితే వైఎస్సార్ మెగా లేఅవుట్ కాలనీలో నీరు పోయే దారి లేదు. దీంతో ఇళ్లకు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాలువలు, సిమెంట్ రోడ్లు లేవు. దీంతో నీరు నిల్వ ఉండిపోయి దుర్గంధం భరించలేకపోతున్నాం. ఇప్పటికైనా తమ ఇబ్బందులు గుర్తించి సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు ఇంటింటి కుళాయిల ద్వారా నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పి.ఈశ్వరమ్మ, వైఎస్సార్ కాలనీ, వడ్డీ వీధి, కశింకోట

కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలి



మంచినీటి సరఫరాకు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే వాటి నుంచి నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో ఏడాదిగా అలంకారప్రాయంగా ఉన్నాయి. సమీపంలోని వడ్డీ వీధిలో దూరంగా వెళ్లి కుళాయి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ విషయమై అధికారులు స్పందించి కుళాయిల నుంచి నీటి సరఫరాను పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

–ఈ.ఆదిలక్ష్మి, వైఎస్సార్ కాలనీ, కశింకోట

యూరియా రాయితీ పేరుతో ప్రభుత్వం మోసం

అనకాపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతులు ఎరువులు కొరత, ధరలు పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీఎం చంద్రబాబు ఎరువుల వాడకం తగ్గిస్తే నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్న ప్రకటన కేవలం మోసపూరితమైనదే తప్ప రైతులకు ఉపయోగం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియాతో సహా అన్ని రకాల ఎరువుల సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. కేంద్రం నుంచి సరిపడా ఎరువులు రాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఈ సంక్షోభం వచ్చిందన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే 'బస్తాకు రూ.800 రాయితీలు ఇస్తామని రైతులను మభ్యపెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా, వాడకాన్ని తగ్గించుకుంటే రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్న కక్కుర్తితో ఈ ఏడాది రాష్ట్రాలకు కేటాయింపు తగ్గించి, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకే రాయితీ ఇస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. మిగిలిన రాష్ట్రాలు పది శాతం తగ్గించుకోగా ఏపీలో 25 శాతం కోతకు అంగీకరించడం దారుణమని, రాష్ట్రానికి వచ్చిన ఎరువులను కూడా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల మద్దతుతో వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సంస్థల ద్వారా సరఫరా చేయాల్సింది పోయి పెత్తందార్లు చేజిక్కించుకోవడంతో ఎరువులకు కొరత ఏర్పడిందని, క్యాన్సర్ రావడానికి అనేక కారణాలుండగా యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. నిజమైతే ఇంత కాలం ఎందుకు మౌనంగా ఉన్నారో.. ఇప్పుడు ఎరువులు సరఫరా చేయలేక క్యాన్సర్ అని భయపెట్టడం ప్రజారోగ్యంపై ప్రభుత్వ చిత్తశుద్ధినే శంకించాల్సి వస్తుందన్నారు. ఎరువులకూ ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులను ఆయన కోరారు.

212 మందికి వైద్య పరీక్షలు



ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్: నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. పట్టణంలోని గాంధీనగరం శంకరన్ హాల్‌లో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషికి వచ్చే కొద్ది పాటి అనారోగ్యాలపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ సందర్భంగా 212 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, ఫార్మసిస్ట్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

- మామిడిపాలెం గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పావని మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్, సర్వైకల్, రొమ్ము, గర్భాశయ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.మంగమ్మ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ లావణ్య

మునగపాక: డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ లావణ్య కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలకు సంబంధించిన లావాదేవీలు సక్రమంగా జరుపుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. మన డబ్బులు–మన లెక్కలపై శిక్షణ పక్కాగా ఉండాలన్నారు.

సంఘాల అభివృద్ధితో పాటు తీసుకున్న రుణాలు సక్రమంగా వాయిదాల పద్ధతిలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తోటాడ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజశేఖర్, సీసీలు శ్రీను, వేణు, అనురాధ, నాగమణి, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

పునరావాస ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశం



బోదిగల్లం వద్ద పునరావాస కాలనీని సందర్శిస్తున్న కార్యదర్శి యువరాజ్

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం బోదిగల్లం వద్ద కల్పిస్తున్న పునరావాస ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ ఆదేశించారు. బుధవారం ఆయన నక్కపల్లి మండలం బోదిగల్లం వద్ద 160 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్‌పార్క్, స్టీల్ ప్లాంట్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోయిన సుమారు 750 మందికి బోదిగల్లం వద్ద ప్రత్యేకంగా కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. వీరికి ఇళ్ల నిర్మాణం కోసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షలు ఇచ్చామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ పనులు చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో నిర్వాసితులను ఖాళీ చేయించి పునరావాస కాలనీకి తరలించే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాలనీలో రోడ్లు, కాలువలు, తాగునీరు, వాడుకనీరు, ఇతర కమ్యూనిటీ అవసరాలు కల్పించే పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాలు పొందిన వారు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతున్నారా? లేదా? అనేది ఆరా తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్‌డీవో రమణ, తహసీల్దార్ మూర్తి, ఏపీఐఐసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మండలంలోని తోటాడ–గవర్ల అనకాపల్లి పరిధిలోని శ్రీమరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గవర్ల అనకాపల్లికి చెందిన ఆళ్ల సూరిబాబు కుమారుడు డాక్టర్ వసంతకుమార్ తనవంతు సాయంగా బుధవారం రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీనవరాత్రుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక మెయిన్‌రోడ్డు అమ్మవారి ఆలయంలో నవరాత్రుల వాల్ పోస్టర్‌ను బుధవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అమ్మవారి శరన్నవరాత్రులు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

యలమంచిలి రూరల్: పట్టణంలో మెడికల్ షాపుల్లో బుధవారం ఐదుగురు ఔషధ నియంత్రణ శాఖ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. లైసెన్సులు తీసుకున్న సుమారు 15 దుకాణాల్లో అధికారులు చేపట్టిన తనిఖీల్లో కొన్ని చోట్ల ఫార్మాసిస్టులు లేకుండా, అమ్మకాలకు తగిన రసీదులు ఇవ్వకుండా దుకాణాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. కొన్ని దుకాణాలకు అధికారులే కొనుగోలుదారుల్లాగా వెళ్లి నిషేధిత నార్కోటిక్స్, మత్తు మందులు, గర్భవిచ్ఛిత్తి ఔషధాలను అడిగారు. ఎక్కడా నిషేధిత మందులు విక్రయించడం లేదని నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కల్యాణి తెలిపారు. వైద్యుడి చీటీలు లేకుండా మందుల విక్రయాలు చేపట్టవద్దని వ్యాపారులను హెచ్చరించారు. పలు దుకాణాల్లో రికార్డులు, స్టాకు వివరాలు, కాలం చెల్లిన మందులు ఉన్నాయా? వంటివి పరిశీలించారు. జిల్లాలో ప్రతి నెలా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు ఇందిరాభారతి, అభీప్రియ, ఎం.శ్రీనివాసరావు, కల్యాణి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం సందర్శన

ఎస్.రాయవరం: గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న తడి, పొడి చెత్తల నిర్వహణ కేంద్రాలను విధిగా వినియోగించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి సూచించారు. గుడివాడ పంచాయతీలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడిపొడి చెత్తల నిర్వహణ కేంద్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు రమేష్‌బాబు, ప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం యుద్ధం?



కోటవురట్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కోటవురట్ల: సాగు చేయాలంటే యూరియా కోసం యుద్ధాలు చేయాల్సిందేనని ఈ రైతులను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. యూరియా ఎక్కడ దొరక్కుండా పోతుందోనని అన్నదాతలు ఇలా ఎగబడుతున్నారు. మండలంలో పీఏసీఎస్ ద్వారా బుధవారం ఎరువుల పంపిణీ ప్రారంభించారు. దీంతో రైతులు యూరియా కోసం ఇలా తొందరపడుతూ ఎగబడ్డారు.

బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యవతి, ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి: గర్భిణులు, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక పౌష్టికాహారం అందజేస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్.శంకరన్ హాల్లో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025, స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ శచిదేవి, అనకాపల్లి సీడీపీవో పి.ప్రభావతి, జిల్లాలో సీడీపీవోలు, ఏసీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ఊరేగింపును ప్రారంభిస్తున్న వర్తకుల సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నిదానందొడ్డి కామాక్షి అమ్మవారి ఆలయంలో విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ ఉత్సవ విగ్రహానికి పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు నూకేశ్వరి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక రథంలో ఊరేగింపు కార్యక్రమాన్ని అనకాపల్లి బంగారు వర్తకల సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర ప్రారంభించారు. అక్కడి నుంచి స్వామివారిని రథంపై పట్టణంలో పురవీధుల్లో ఊరేగిస్తూ విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించి, అనంతరం స్వామివారి ఊరేగింపు రథాన్ని నిదానందొడ్డి కామాక్షి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సత్య నరసింహ ఆచారి(పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మ జీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపాటి సుందరయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాహన మిత్ర కింద రూ.30వేలు ఇవ్వాలి



ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు

అచ్యుతాపురం రూరల్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.30 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం అచ్యుతాపురం కూడలిలో ఆటో, క్యాబ్, టాటా ఏసీ డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము మాట్లాడుతూ జీవో 21 రద్దు చేసి ఇన్సూరెన్స్, జరిమానా రద్దు చేసి, ఉబర్, ఓలా సర్వీసులు ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం చోడమాంబిక ఆటో యూనియన్ నాయకులు దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను, గోవిందు, చిట్టి, రంగారావు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ వద్దంటూ నిరసన



గుర్రాజుపేట బల్క్‌డ్రగ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఎస్.రాయవరం: రసాయన వ్యర్థాలు వెదజల్లే బల్క్‌డ్రగ్ కంపెనీ తమకొద్దని గుర్రాజుపేట గ్రామ రైతులు బుధవారం నిరసన తెలిపారు. సచివాలయం వద్ద సమావేశమై నినాదాలు చేశారు. ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా ప్రయోజనాలు చేకూర్చే పరిశ్రమలు పెట్టాలని, ఇలా ప్రాణాలు తీసే కంపెనీలు తమ ప్రాంతంలో పెట్టవద్దని కోరారు. రాజ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తామంతా మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలో రామ్‌రాజు, శ్రీనురాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.